ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం



బండ్లగూడలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

బండ్లగూడ: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఎప్పటికప్పుడు నిధులను మంజూరు చేయిస్తూ అభివృద్ధి పనులను చేపడుతున్నామని ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 7, 8, 12, 18 డివిజన్లలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. మొత్తం రూ.17.36 కోట్లతో సీసీ రోడ్లు, అండర్ డ్రైనేజీ గ్రౌండ్, కమ్యూనిటీహాల్స్ నిర్మాణం తదతర పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. ప్రజలకు మెరుగైన సౌకర్యాల కల్పనే ధ్యేయంగా పని చేస్తున్నామన్నారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. వాటిని సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ లతాప్రేమ్‌గౌడ్, డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి, కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ కమిషనర్ బి.శరత్‌చంద్ర, డీఈఈ, ఏఈఈ, హెచ్ఎండీఏ ఈఈ, డీఈఈ పాల్గొన్నారు.


వెలగని వీధిదీపాలకు వెంటనే మరమ్మతులు చేయాలి



అత్తాపూర్‌లో వెలగని వీధిదీపాలను పరిశీలిస్తున్న అప్పారెడ్డి ముఖేష్

అత్తాపూర్: వెలగని వీధిదీపాలకు వెంటనే మరమ్మతులు చేయాలని అత్తాపూర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు అప్పారెడ్డి ముఖేష్ అన్నారు. శనివారం డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో పర్యటించి ప్రజలను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా వీధిదీపాల సమస్య అధికంగా ఉందని వారు ఆయనకు వివరించారు. వెంటనే అధికారులకు ఫోన్ చేసి ఆయన సమస్యను వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అత్తాపూర్ డివిజన్ పరిధిలోని బస్తీలు, కాలనీల్లో వీధిదీపాలు పూర్తిగా పాడైపోయాయన్నారు. స్తంభాలు ఉన్నా వాటికి లైట్లు వెలగడం లేదు. వీటిని ఏర్పాటు చేసి సంవత్సరాలు గడుస్తుండడంతో అవి పాడైపోయాయన్నారు. వీటికి మరమ్మతులు చేయడంతో పాటు కొత్త వీధిలైట్లను ఏర్పాటు చేయాలని కోరారు. అధికారులు వెంటనే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు.

ఉపాధి కల్పించడమే లక్ష్యంగా విద్యలో మార్పులు



వీసీని సన్మానిస్తున్న సిబ్బంది, తూటా సంఘ సభ్యులు

ఏజీవర్సిటీ: ఉద్యాన విద్యార్థులకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా విద్యలో మార్పులు తీసుకొస్తామని కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి దండా రాజిరెడ్డి అన్నారు. ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతిగా నియమితులైన తర్వాత మొదటిసారి ఆయన రాజేంద్రనగర్ ఉద్యాన కళాశాల సందర్శించారు. తెలంగాణ హార్టికల్చరల్ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వరంలో ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వీసీ మాట్లాడారు. విద్యార్థులు ఎప్పటికప్పుడు స్కిల్స్ డెవలప్‌మెంట్ చేసుకుంటూ ఉద్యాన పంటల సాగులో ఆధునిక పోకడలను తెలుసుకోవాలని వివరించారు. ఈ కార్యక్రమంలో తూటా సంఘం నాయకులు, విశ్వవిద్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

అనారోగ్యంతో మున్సిపల్ కార్మికురాలి మృతి



నివాళులర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మున్సిపల్ కార్మికురాలిగా పని చేస్తున్న లింగాల లక్ష్మమ్మ అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. జిల్లా అధ్యక్షులు యాదగిరి, గండిపేట మండల కన్వీనర్ దప్పు ప్రవీణ్‌కుమార్‌లు ఆమె మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జవాన్లు జగన్, మల్లేష్, సురేష్, వెంకటేష్, రాము, నరేందర్, కృష్ణ, లక్ష్మీనారాయణ, రామాంజనేయులు, ప్రభావతి, సుజాత, రాజమణి, సావిత్రి తదితరులు పాల్గొన్నారు. లక్ష్మమ్మ మృతి చెందడంతో కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

సమగ్ర సర్వేపై అవగాహన



రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ కాన్ఫరెన్స్ హాల్‌లో శనివారం రాజేంద్రనగర్ సర్కిల్‌లోని ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఇంటింటికి సమగ్ర సర్వేపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ డిప్యూటీ కమిషనర్ రవికుమార్, ఏఈఓ శంకర్, సర్కిల్ స్థాయి మాస్టర్ ట్రైనర్లు డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ వసీం, నోడల్ అధికారి, ఏఎంసీ, జయప్రకాశ్, సీఓ విజయ్, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ లైన్‌మన్ మృతి

గచ్చిబౌలి: మద్యం మత్తులో కిందపడ్డ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ వెంకన్న తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. రాయదుర్గంలో నివాసం ఉండే గడ్డమీది కుమార్(45) జహీరాబాద్‌లో లైన్‌మన్‌గా పని చేస్తున్నాడు. తాగుడుకు బానిస అయ్యాడు. దీపావళి రోజు రాత్రి అతిగా మద్యం సేవించి ఇంటికి వెళ్లి భార్యతో గొడవ పడ్డాడు. అనంతరం నడుచుకుంటూ వెళుతూ కాలనీలో కింద పడిపోవడంతో కుటుంబ సభ్యులు రాయదుర్గంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం తెల్లవారు జామున మృతి చెందాడు. అతిగా మద్యం తాగి పడిపోవడంతో శ్వాస ఆడక మృతి చెంది ఉంటాడని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సందడిగా సదర్



హైదర్షాకోట్‌లో సదర్ ఉత్సవాల్లో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్



బుద్వేల్‌లో రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్‌యాదవ్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు



సదర్ ఉత్సవాల్లో రాజేంద్రనగర్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి

బండ్లగూడ: హైదర్షాకోట్ యాదవ సంఘం ఆధ్వర్యంలో యాదవులు సంస్కృతి సంప్రదాయంలో భాగంగా జరుపుకునే సదరు ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. దున్నరాజులను అందంగా అలంకరించి ఊరేగించారు. సరదాగా తీన్మార్ డ్యాన్సులు చేస్తూ హంగామా చేశారు. ఉత్సవాల్లో ముఖ్యఅతిథిగా రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యాదవ సోదరులకు సదర్, దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు.

మైలార్‌దేవ్‌పల్లిలో..

మైలార్‌దేవ్‌పల్లి: దీపావళిని పురస్కరించుకొని ఉడంగడ్డలో సదర్ వేడుకలను మైలార్‌దేవ్‌పల్లి యాదవ సంఘం అధ్యక్షుడు అక్కెం కృష్ణ యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, రాజేంద్రనగర్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తీక్ రెడ్డి, కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి హాజరయ్యారు. సదర్ ఉత్సవాల్లో బ్యాండు మేళాలతో వైభవంగా దున్నరాజుల విన్యాసాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు శ్రీనాథ్ యాదవ్, రాముయాదవ్, వెంకటేష్, అరుణ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బుద్వేల్‌లో..

రాజేంద్రనగర్: బుద్వేల్‌లో యాదవ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి సదర్ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. నరేష్ యాదవ్, సాజిత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, రాజ్యసభ సభ్యుడు అనీల్‌కుమార్‌యాదవ్ తదితరులు హాజరయ్యారు.

నేడు విద్యుత్ వినియోగదారుల దినోత్సవం

మణికొండ: ఇబ్రహింబాగ్ డివిజన్ పరిధిలోని మణికొండ, నార్సింగి మున్సిపాలిటీలు, బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని విద్యుత్ వినయోగదారుల సమస్యలు, బిల్లులు ఎక్కువ రావటం తదితర సమస్యలను పరిష్కరించేందుకు ఆదివారం సదస్సు ఏర్పాటు చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి ఇబ్రహింబాగ్ సబ్ డివిజన్ కార్యాలయం వద్ద ఈ కార్యక్రమం ఉంటుందని, సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించటం జరుగుతుందన్నారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు.

శివరాంపల్లిలో..

మైలార్‌దేవ్‌పల్లి: విద్యుత్ వినియోగదారులు తమ ప్రాంతాల్లో ఏవైన సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సబ్ డివిజన్ ఏడీఈ ఈశ్వర్ ప్రసాద్ తెలిపారు. తమ ప్రాంతాల్లో విద్యుత్ సమస్యలు పరిష్కరించడానికి విద్యుత్ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా శివరాంపల్లిలోని విద్యుత్ కార్యాలయంలో ఆదివారం సదస్సు నిర్వహించనున్నారని పేర్కొన్నారు. ఏవైన సమస్యలు ఉంటే విద్యుత్ కార్యాలయంలో దరఖాస్తు ఇవ్వాలని సూచించారు.

రాజేంద్రనగర్ సెక్షన్ ఆఫీస్ వద్ద..

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ విద్యుత్ శాఖ సబ్ డివిజన్ రాజేంద్రనగర్ సెక్షన్ ఆఫీస్ వద్ద ఈ నెల 3న విద్యుత్ వినియోగదారుల దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు రాజేంద్రనగర్ సెక్షన్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ సత్యనారాయణ తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యుత్ వినియోగదారులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యుత్ స్తంభాలు, వైర్లు, బిల్లుల్లో సమస్యలు, సరఫరాలో సమస్యలు వంటి వాటిని విద్యుత్ శాఖ అధికారులకు తెలియజేసి సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు.

మ్యాన్‌హోళ్లకు మరమ్మతు



కాళీ మందిర్ ప్రాంతంలో మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్..

బండ్లగూడ: రోడ్లపై ప్రమాదకరంగా ఉన్న మ్యాన్‌హోళ్లకు అధికారులు శనివారం మరమ్మతులు చేశారు. గత నెల 28న 'సాక్షి'దినపత్రికలో ప్రచురితమైన 'ప్రమాదకరంగా మ్యాన్‌హోల్స్'అనే శీర్షికకు అధికారులు స్పందించారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని జాతీయ రహదారిపై ఉన్న మ్యాన్‌హోల్స్ గుంతలమయంగా మారి పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. ఈ దారి గుండా ప్రయాణిస్తున్న వాహనాదారులు, ప్రజలు అనేక ప్రమాదాలకు గురవుతున్నారు. దీంతో 'సాక్షి'ఈ కథనాన్ని ప్రచురించింది. స్పందించిన అధికారులు మరమ్మతు పనులను నిర్వహించి సమస్యను పరిష్కరించారు.

రోడ్లకు మరమ్మతు చేస్తాం



కేపీఆర్ కాలనీలో కొనసాగుతున్న ప్యాచ్ వర్క్‌లను పరిశీలిస్తున్న రామకృష్ణారెడ్డి

మణికొండ: జలమండలి, డ్రైనేజీ తదతర పనులతో రోడ్లపై ఏర్పడిన గుంతలను ప్యాచ్ వర్క్‌లతో మరమ్మతులు చేపడతామని మణికొండ మున్సిపాలిటీ 19వ వార్డు కౌన్సిలర్ కె.రామకృష్ణారెడ్డి అన్నారు. శనివారం ఆయన వార్డులో కొనసాగుతున్న ప్యాచ్ వర్క్ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మున్సిపాలిటీ పరిధిలో చాలా వరకు రోడ్లు వేశాక తిరిగి గుంతలు తీయడంతో గుంతలమయంగా మారాయన్నారు. అలాంటి వాటి మరమ్మతులకు వార్డుల వారీగా నిధులను కేటాయించారని, త్వరలోనే వాటి సమస్య తీరుతుందన్నారు.

చెత్తను స్వచ్ఛ ఆటోలకు అందించాలి

బండ్లగూడ: ప్రజలు తమ ఇంట్లోని చెత్తను స్వచ్ఛ ఆటోలకు అందించాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర అన్నారు. ఇంద్రారెడ్డినగర్, శాంతినగర్, భాగ్యరాజ్‌నగర్‌లలో శనివారం ఆయన పర్యటించి ఇంటింటి చెత్త సేకరణ పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..100 శాతం ఇంటింటి చెత్త సేకరణ జరగాలన్నారు. తడి, పొడి చెత్తను వేరు చేసి తీసుకోవాలన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ప్రతిఒక్కరూ బాధ్యతగా భావించాలన్నారు. ఈ కార్యక్రమంలో బిల్ కలెక్టర్ చంద్రశేఖర్, శానిటరీ జవాన్లు మల్లేష్, వెంకటేష్, సుభాష్ తదతరులు పాల్గొన్నారు.



చెత్త సేకరణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర

మెట్రో వస్తే.. మరింత అభివృద్ధి




మారనున్న ఖాజాగూడ, నానక్‌రాంగూడ పరిసర ప్రాంతాల రూపురేఖలు

రాయదుర్గం మెట్రోస్టేషన్ నుంచి కోకాపేట్ నియోపోలీస్ వరకు రూట్



మధురానగర్ నుంచి నానక్‌రాంగూడ ఓఆర్ఆర్ అండర్ బ్రిడ్జి వరకున్న మోడల్ రోడ్డు మధ్య డివైడర్‌పై మెట్రో పిల్లర్లు ఏర్పాటు చేయాలని సంకల్పించిన ప్రాంతం ఇదే..



మెట్రో రైలు రూట్ మ్యాప్

రాయదుర్గం: మెట్రో రైలు రాకతో ఈ ప్రాంత రూపురేఖలు మారుతాయని ప్రజలు ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే మధురానగర్ నుంచి ఖాజాగూడ మీదుగా నానక్‌రాంగూడ వరకు మోడల్ రోడ్డు నిర్మాణంలో డివైడర్ మధ్య భారీ స్థలం కేవలం మెట్రో ఏర్పాటు కోసం వదిలేయడంతో భూ సమస్య కూడా చాలా వరకు తగ్గిపోయింది. ఆ తర్వాతి ప్రాంతాలలోనే కొంతవరకు సమస్య తలెత్తే అవకాశముంది. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ఏర్పాటుతో బస్సులు తగ్గాయని మధురానగర్, ఖాజాగూడ, ప్రశాంత్‌హిల్స్, సాయిఐశ్వర్య, సాయి వైభవ్ కాలనీలు, నానక్‌రాంగూడ పరిసర కాలనీవాసులు భావిస్తున్న నేపథ్యంలో మెట్రోరైలు ప్రకటనతో అందరిలోనూ సంతోషం వ్యక్తమవుతోంది.

మెట్రో రూట్ ముఖ్యాంశాలు...

- రెండవదశ కింద మైండ్‌స్పేస్ నుంచి బయోడైవర్సిటీ పార్కు మీదుగా మధురానగర్, ఖాజాగూడ, నానక్‌రాం గూడ వరకున్న ప్రధాన రోడ్డు మధ్యన పిల్లర్లు ఏర్పాటు చేసి మెట్రో ట్రాక్‌ను ఏర్పాటు చేయడానికి అధికారులు ప్రణాళికలు రూపొందించారు.
- వచ్చే నాలుగేళ్లలో ఈ రూట్‌లో మెట్రో సౌకర్యం ఏర్పడేలా చేయాలని సంకల్పించారు.
- ఈ రూట్‌లో 10 మెట్రో స్టేషన్లు ఏర్పాటు చేయాలని నిర్ణయం

రాయదుర్గం మెట్రోస్టేషన్-కోకాపేట్ నియో పోలీస్ మెట్రోస్టేషన్ మధ్య 10 స్టేషన్లు

- రాయదుర్గం మెట్రో స్టేషన్ నుంచి కోకాపేట్ నియో పోలీస్ మెట్రో స్టేషన్ మధ్య 10 స్టేషన్లు ఏర్పాటు చేయాలని అధికార యంత్రాంగం సంకల్పించింది. మాదాపూర్ ఐటీ కారిడార్ నుంచి హైదరాబాద్ నాలెడ్జి సిటీ మీదుగా ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంను కలిపేలా ఈ రూట్ ఏర్పాటు చేశారు.
- మైండ్‌స్పేస్‌లోని రాయదుర్గం మెట్రోస్టేషన్ నుంచి బయలుదేరిన తర్వాత బయోడైవర్సిటీ జంక్షన్, ఖాజాగూడ, నానక్‌రాంగూడ, గోల్ఫ్‌కోర్టు, విప్రో సర్కిల్, పుప్పాల్‌గూడ ,ఓఆర్ఆర్ జంక్షన్, ఖానాపూర్, మూవీ టవర్స్, కోకాపేట్ నియోపోలీస్ పది మెట్రో స్టేషన్లు ఏర్పాటు చేస్తారు.ఈ స్టేషన్ల ఏర్పాటుతో చేరువలోని గచ్చిబౌలి డివిజన్‌లోని మధురానగర్, ప్రశాంత్‌హిల్స్, సాయిఐశ్వర్య, సాయివైభవ్, చిత్రపురి కాలనీ, మణికొండ, గొలిదొడ్డి, కేశవనగర్, బసవతారకనగర్ వంటి ప్రాంతాల వారికి కూడా ఎంతో మేలు చేకూరే అవకాశం లేకపోలేదు.